క్లుప్తంగా

ఘనంగా కుంభాభిషేక ఉత్సవాలు



గూడూరు: పట్టణంలోని గాంధీబొమ్మ కూడలిలో ఉన్న కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శత వార్షికోత్సవం సందర్భంగా కుంభాభిషేక ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయం నిర్మించి వందేళ్లు పూర్తి అయిన సందర్భంగా ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, కంకణ ధారణ, యాగశాల ప్రవేశం తదితర కార్యక్రమాలను వేద పండుతుల ఘనంగా నిర్వహించారు. అనంతరం త్యాగరాజ వీధిలోని శివాలయం నుంచి శ్రీ చక్ర మేరువును ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. మహిళల కోలాట ప్రదర్శన అందర్నీ అలరించింది.

చెట్టును ఢీకొన్న లారీ.. ఇద్దరికి గాయాలు

దొరవారిసత్రం: అక్కరపాక గ్రామానికి సమీపంలో జాతీయ రహదారిపై చెన్నై నుంచి నెల్లూరుకు వెళ్లే మినీ లారీ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఆదివారం రాత్రి ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ షేక్ మస్తాన్‌తో పాటు లారీలో ప్రయాణించే మరో వ్యక్తి చంద్రమోహన్ గాయపడ్డారు. వీరిని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. స్థానిక పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీసీలకు ఉద్యోగోన్నతి

నెల్లూరు(క్రైమ్): ఐదుగురు కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న ఎంపీ రమణయ్య (శ్రీహరికోట), ఎం.శ్రీనివాసులు (వెంకటగిరి), ఎల్.చిరంజీవులు (పెళ్లకూరు), బి.సుధాకర్ (తడ), నెల్లూరు జిల్లాకు చెందిన కె.కిరణ్ (డీఎస్‌బీ)లు ఉద్యోగోన్నతి పొందిన వారిలో ఉన్నారు. కాగా తిరుపతి జిల్లా సిబ్బందికి సంబంధించిన సర్వీస్ రికార్డులను నెల్లూరులోని పోలీస్ కార్యాలయంలోనే నిర్వహిస్తున్నారు.

వైభవంగా కల్యాణోత్సవం



నాయుడుపేటటౌన్: మండలంలోని తిమ్మాజి కండ్రిగ వద్ద స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న అభయ అనుగ్రహ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. పద్మావతి పరిణయోత్సవం సందర్భంగా తిరుమలలో జరిగేలా స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని స్థానిక ఆలయం వద్ద శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, భాస్కర్ దంపతులు, తిమ్మాజి కండ్రిగ సర్పంచ్ నల్లారి ప్రకాశం దంపతులు, మాజీ సర్పంచ్‌లు లోడారి మనోహర్, పల్లేటి రమణయ్య పాల్గొన్నారు.

ఘనంగా అంబళ్లు

నాయుడుపేటటౌన్: గ్రామదేవత జాతరలో భాగంగా సోమవారం ఆలయం వద్ద అంబళ్ల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యం పెట్టి, ప్రత్యేక పూజలు చేశారు. జాతరను వైభవంగా నిర్వహించేందుకు దేవాదాయ శాఖ, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. విద్యుత్‌దీపాలంకరణ చేశారు. భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గవదవల్లి సిద్దయ్య వెల్లడించారు.

శ్రమజీవుల పండుగ.. ఊరూరా వేడుక





గూడూరులో ర్యాలీ చేస్తున్న కార్మిక సంఘాల నేతలు, సూళ్లూరుపేట: సీపీఐ ఆధ్వర్యంలో రక్తదానం చేస్తున్న నేతలు, వెంకటగిరి: ర్యాలీలో పాల్గొన్న కుల్లూరు జాన్, తదితరులు

- ఘనంగా మేడే

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లో సోమవారం శ్రమజీవుల పండుగైన మేడేని ఊరూరా ఘనంగా జరుపుకున్నారు. కార్మిక సంఘాలు నేతలు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

గూడూరు: పట్టణంలోని కూరగాయల మార్కెట్ సెంటర్ వద్ద సీఐటీయూ, ఆటో యూనియన్‌ల ఆధ్వర్యంలో సోమవారం మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నెల్లూరు యాదగిరి, జి బాలసుబ్రమణ్యం, ఆటో యూనియన్ జిల్లా నాయకులు బీవీ రమణయ్య, పట్టణ కార్యదర్శి బీ రమేష్, డీ శీనయ్య, సురేంద్ర, వెంకటేశ్వర్లు, కోటయ్య, భాస్కర్, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, రవి పాల్గొన్నారు. అలాగే మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు జీ బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో మే డే జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీపీఎం, సీపీఐల ఆధ్వర్యంలో వేర్వేరుగా భారీ ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో జోగి శివకుమార్, మణి, గోపీనాథ్, బీవీ రమణయ్య, ప్రసాద్, శంకరయ్య, సంపూర్ణమ్మ, ప్రభావతి, పెంచలమ్మ, మణమ్మ, పోలమ్మ, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

చిల్లకూరులో..

చిల్లకూరు: మండలంలోని పలు గ్రామాల్లో మే డే ఘనంగా నిర్వహించారు. నాయకులు జెండా ఎగురవేసి స్వీట్లు పంపిణీ చేశారు. సీపీఐ కార్యవర్గ సభ్యుడు సీహెచ్ ప్రబాకర్, తిమ్మనగారిపాళెం సర్పంచ్ గిద్దలూరు సుమలత, వీఆర్వోల సంఘం గూడూరు డివిజన్ నాయకులు రమణయ్య, అంబేడ్కర్ గ్రామ కమిటీ సభ్యులు జోగి తమ్ము, మణి, శివ, ఆనంద్, శేషయ్య, కృష్ణయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

కోటలో..

కోట: సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం మే డే వేడుకలను కోటలో ఘనంగా నిర్వహించారు. బజారువీధిలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటం ఏర్పాటు చేసి, కార్మికులు నివాళులర్పించి, జెండాను ఆవిష్కరించారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేశారు. సీపీఎం నాయకుడు పీవీ కృష్ణయ్య, సీఐటీయూ మండల కార్యదర్శి హరినాథ్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు నాగరాజు, వెంకటకృష్ణయ్య పాల్గొన్నారు.

నాయుడుపేటలో..

నాయుడుపేటటౌన్: పట్టణంలో మేడే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు చాపల వెంకటేశ్వర్లు, నాయకులు ముకుందా, పద్మావతి పాల్గొన్నారు.

రాపూరులో..

రాపూరు: ఆర్టీసీ డిపోలో ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు జెండా ఎగరవేసి మేడే జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో రీజినల్ నాయకులు డీబీకే రెడ్డి, భాస్కర్, అహ్మద్, డిపో కార్యదర్శి మురళి, అధ్యక్షుడు బాబు, కోశాధికారి జనార్దన్, వాసు, ప్రసాద్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

సైదాపురంలో..

సైదాపురం: రైతుకూలీల సంఘం జిల్లా కన్వీనర్ డీపీ పోలయ్య ఆధ్వర్యంలో కార్మికులు మేడే ఘనంగా జరుపుకున్నారు. అనంతరం ఐఎఫ్‌టీయూ జెండాను మండల కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి చెంగల్రావు ఆవిష్కరించారు. చెంగల్‌రావు, డేగా శ్రీనివాసులు, మురారి కృష్ణయ్య, మల్లారపు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వాకాడులో..

వాకాడు: ఆర్టీసీ డిపోలో సీఐటీయూ కార్మికులు మేడే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. నాయకుడు బీవీ రమణయ్య జెండా ఎగరవేసి మిఠాయిలు పంపిణీ చేశారు.

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట: పట్టణంలోని వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మేడే ఘనంగా జరుపుకున్నారు. సీపీఐ ఆధ్వర్యంలో చెంగేణి సుధాకర్, నాగేంద్ర పార్టీ కార్యాలయం అవరణలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. సీపీఎం కార్యాలయం ముందు పద్మనాభయ్య, సుంకర అల్లెయ్య పార్టీ జెండాలను అవిష్కరించారు. బస్టాండ్ సెంటర్‌లో మజ్జిగ చలివేంద్రం, అన్నదానం, రక్తదానం తదితర సేవా కార్యక్రమాలను నిర్వహించారు.

వెంకటగిరిలో..

వెంకటగిరి: మేడే వేడుకలు సోమవారం పట్టణంలో పలు కార్మిక సంఘాల నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. సీఐటీయూ జిల్లా నాయకులు వడ్డిపల్లి చెంగయ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, ఏపీపీ ప్రకృతికుమార్, సీఐటీయూ జిల్లా నాయకులు స్వరూపరాణి, మంజుల, పట్టణ అధ్యక్షులు ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో....

ఏఐటీయూసీ మున్సిపల్ వర్కింగ్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుల్లూరు జాన్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పి బాలకృష్ణయ్య, పట్టణ కార్యదర్శి డి శివ, భవన నిర్మాణ కార్మికసంఘం కన్వీనర్ చెంజి వరుణ్‌కుమార్ పాల్గొన్నారు. ప్రజాతంత్ర చేనేత కార్మికసంఘం ఆధ్వర్యంలో మేడే జరుపుకున్నారు.

చంద్రబాబు కుటిల స్వభావి

పెళ్లకూరు: టీడీపీ అధినేత చంద్రబాబు కుటిల స్వభావం కలిగి వ్యక్తి అని, ఆయన తన రాజకీయ మనుగడను కాపాడుకోవడం కోసమే తాపత్రయ పడుతున్నారని వైఎస్సార్ సీపీ నగరి నియోజకవర్గం పార్టీ పరిశీలకులు చిందపల్లి మధుసూదన్ రెడ్డి అన్నారు. సోమవారం పుల్లూరులోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. 14 ఏళ్ల సీఎంగా కొనసాగిన చంద్రబాబు రాష్ట్రాభివృద్ధిని పట్టించుకోకుండా హెరిటేజ్ కంపెనీతో పాటు రూ.లక్షల కోట్లు కూడబెట్టుకున్నాడని ఆరోపించారు. అక్రమంగా సంపాదించిన ఆస్తులను కాపాడుకోవడం కోసమే రాజకీయాన్ని అడ్డం పెట్టుకుని రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నట్లు విమర్శించారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్రలో పస లేదన్న విషయాన్ని సాక్ష్యాత్తు టీడీపీ నేతలే బాహాటంగా విమర్శలు చేస్తున్నట్లు చెప్పారు. నాయకులు మునివర్ధన్‌రెడ్డి, యువరాజ్, భక్తవత్సలం, బాలాజీ పాల్గొన్నారు.

తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

వాకాడు: పౌర్ణమి సందర్భంగా ఈ నెల 4, 5 తేదీల్లో వాకాడు ఆర్టీసీ డిపో నుంచి తిరువణ్ణామలై (అరుణాచలం) పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ మధుశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ అరుణాచలం గిరి ప్రదక్షిణ, దర్శనం నిమిత్తం స్పెషల్ బస్సులు కోట బస్టాండ్ నుంచి బయలుదేరుతాయన్నారు. 4వ తేదీ ఉదయం 9.00, 11.00, మధ్యాహ్నం 12.30, 3.00 గంటలకు, అలాగే 5వ తేదీ ఉదయం 9.00, 11.00 గంటలకు స్పెషల్ బస్సులు నడుపుతామన్నారు.

'స్పందన' నిర్వహించాలి

చిల్లకూరు: సచివాలయాల్లో మధ్యాహ్నం 3 గంటలకు స్పందన కార్యక్రమం నిర్వహించాలని సచివాలయ సిబ్బందికి తహసీల్దార్ అజ్మతుల్లాఖాన్ సూచించారు. చిల్లకూరులోని సచివాలయాన్ని ఆయన సోమవారం తనిఖీ చేసి, అక్కడ రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాలకు రాలేని వారు తమ సమస్యలను స్థానికంగా ఉండే సచివాలయంలో తెలియజేసుకునేందుకు సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా స్పందన కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు.

విద్యా సామగ్రి పంపిణీ

గూడూరు: పట్టణంలోని బనిగీసాహేబ్ పేటలోని చిన్నారులకు మోహమ్మద్ పక్రుద్దీన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎండీ అన్వర్, బాబు, కరీముల్లా, గయాజ్ తదితరులు పాల్గొన్నారు.





సైదాపురం: పింఛన్ ఇస్తున్న వలంటీర్ అనంతమ్మ

వృద్ధుడుకి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మణెమ్మ

చిల్లకూరు: వృద్ధుడికి పింఛన్ అందిస్తున్న వలంటీర్

నిద్రలేపి పింఛన్ పంపిణీ

సైదాపురం: మండలంలోని 31 పంచాయతీల్లో సోమవారం ఉదయం 6 గంటల నుంచే పింఛన్లు పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. కొత్తగా మంజూరైన పింఛన్‌దారుల ఇళ్ల వద్దకే వెళ్లి వారి ఇంటి తలుపు తట్టి వలంటీర్లు పింఛన్లను పంపిణీ చేశారు.

90శాతం పైగా పింఛన్‌ల పంపిణీ

నాయుడుపేటటౌన్: మున్సిపాలిటీలో సోమవారం సాయంత్రానికి 90 శాతం పైగా పింఛన్లను పంపిణీ చేసినట్లు కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. మొత్తం 4,222 పింఛన్లకుగాను సాయంత్రం వరకు 3,990 వరకు పంపిణీ చేశామన్నారు.

పింఛన్ల పంపిణీ

చిల్లకూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో వలంటీర్లు వేకువజామునే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. తొలిరోజే 80 శాతం పూర్తి చేశామని ఎంపీడీఓ విష్ణుచిరంజీవి తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

తడ: మండలంలోని అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ ఆమోసుబాబు సూచించారు. మండల సాధారణ సర్వసభ్య సమావేశం సోమవారం తడ ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. మండలంలో జరిగిన పలు అభివృద్ధి పనులు, నిర్వహించాల్సిన పనుల గురించి అధికారులతో చర్చించారు. ఎండలు తీవ్రం అవుతున్నందున తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈని ఆదేశించారు. వీఆర్వోలు గ్రామాల్లో అందుబాటులో ఉండడం లేదని ఆరోపణలు వస్తున్నందున అలాంటి వాటికి అవకాశం లేకుండా చూసుకోవాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

తొలుత ఇటీవల అనారోగ్యంతో మరణించిన కార్యాలయ టైపిస్ట్ రాజశేఖర్ మృతికి సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఎంపీపీ కే రఘురెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఇందుమతి, డీసీఎంఎస్ డైరెక్టర్ గండవరం సురేష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేష్, డీటీ శరత్ బాబు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

పేదరికమే ప్రామాణికంగా పథకాలు



డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

ఓజిలి: పేదరికమే ప్రామాణికంగా అర్హులందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, ఆయనే మళ్లీ అధికారంలో రావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. చిల్లమానుచేనులో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందాయని, లబ్ధిదారులు అందరూ సుఖసంతోషాలతో జగనన్న పరిపాలనను మెచ్చుకుంటున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు నాయకులు, కార్యకర్తలు, వలంటీర్ వ్యవస్థ పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

భవనాలు ప్రారంభం

చిల్లమానుచేనులో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ కేంద్రాల భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా భవన ప్రారంభానికి విచ్చేసిన ఎమ్మెల్యేను స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరుణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రవీంద్రరాజు, ఏఎంసీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ప్రసాద్‌రాజు, రామ్‌ప్రసాద్‌రాజు, సహకార సంఘం అధ్యక్షురాలు వుచ్చూరు శోభరాణి, జేసీఎస్ కన్వీనర్ ఖాదర్‌బాషా, నాయకులు మధుసూదన్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, సుబ్బారావుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సత్వరమే సమస్యల పరిష్కారం

సైదాపురం: స్పందన ద్వారా వచ్చే ప్రతి అర్జీకి సంబంధించిన సమస్యను సత్వరమే పరిష్కరిస్తున్నట్లు తహసీల్దార్ వి విజయలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 10 సమస్యలపై ప్రజలు అర్జీలను సమర్పించారు.

విత్తనాల పంపిణీ

కలువాయి: మండలంలో వరి సాగు చేసే రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తున్నామని ఏఓ వి.ప్రతాప్ తెలిపారు. కలువాయి రైతు భరోసా కేంద్రం-1లో జనుము, పిల్లి పెసర విత్తనాల పంపిణీని సోమవారం జెడ్పీటీసీ సభ్యులు బి.అనిల్‌కుమార్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు.

57 యూనిట్ల రక్తం సేకరణ

కలువాయి: స్థానిక జెడ్పీ హైస్కూలులో సోమవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో దాతల నుంచి 57 యూనిట్ల రక్తం సేకరించినట్లు ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.పెంచల పుల్లయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జనార్దనరెడ్డి, ఉపాధ్యాయులు, భార్గవ్, మహేష్, నూర్‌బాషా, షఫీ, వీరేంద్ర, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను ఆధునికీకరిస్తాం



రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం గణేష్, ఏజీఎం కౌశల్ కిషోర్, అధికారులు బృందం

సూళ్లూరుపేట: రైల్వేస్టేషన్‌ను ఆధునికీకరించేందుకు కేంద్రరైల్వేశాఖ నిధులు కేటాయించిందని సదరన్ రైల్వే డివిజనల్ మేనేజర్ గణేష్ తెలిపారు. సోమవారం డీఆర్‌ఎం గణేష్, ఏజీఎం కౌశల్ కిషోర్‌తో పాటు ఇంజినీరింగ్‌శాఖ అధికారులు సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను పరిశీలించారు. డీఆర్‌ఎం మాట్లాడుతూ భారతదేశంలోని రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేయడానికి అమృత్ భారత్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ఇటీవలే ప్రారంభించిందన్నారు. ఈ పథకంలో భాగంగా దక్షిణ రైల్వే పరిధిలోని 15 రైల్వేస్టేషన్లను మోడల్ రైల్వేస్టేషన్లుగా ఎంపిక చేయడంలో భాగంగా సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను కూడా ఎంపిక చేశారన్నారు. అయితే సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను షార్ కేంద్రాన్ని దృష్టిలో పెట్టుకోవడంతో పాటు ప్రయాణికుల పరంగా ఆదాయ వనరులు పెరగడంతో ఈ రైల్వేస్టేషన్‌ను మోడల్ రైల్వేస్టేషన్‌గా నిర్మించనున్నామని తెలిపారు. సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను మేజర్ సిటీలో ఉన్న రైల్వేస్టేషన్ల తరహాలో నిర్మించేందుకు మొదటి విడతగా రూ.11 కోట్లు విడుదల చేయనున్నట్లు తెలిపారు. తరువాత మరో రూ.12 కోట్లు కూడా మంజూరయ్యే అవకాశం ఉందని తెలిపారు. రైల్వేస్టేషన్ నిర్మాణం కూడా రాబోయే 120 రోజుల్లోనే పూర్తి చేయాలనే ఆలోచనలో ఉన్నామన్నారు.

గృహనిర్మాణాలు వేగవంతం చేయాలి

వెంకటగిరిరూరల్ (బాలాయపల్లి): బాలాయపల్లి మండలంలోని జగనన్న కాలనీలో స్థలాలు మంజూరైన లబ్ధిదారులు గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీఓ స్వరూపరాణి అన్నారు. మండలంలోని వెంగమాంబపురం పంచాయతీలో లబ్ధిదారులకు గృహనిర్మాణాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ పేదవారు సొంతింటి కలను నెరవేర్చుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అర్హులను గుర్తించి, ఇళ్ల పట్టాలు మంజూరు చేసినట్లు తెలిపారు.

లయన్స్‌క్లబ్ ప్రారంభం రేపు

సూళ్లూరుపేట: పట్టణంలో ఈనెల 3వ తేదీన లయన్స్ క్లబ్ ఆఫ్ సూళ్లూరుపేట షార్‌ను లాంఛనంగా ప్రారంభిస్తున్నామని క్లబ్ చార్టెడ్ అధ్యక్షుడు ఆదిశేషారెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక శేషసాయి కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన విలేకరులతో సమావేశంలో ఆయన మాట్లాడారు. లయన్స్‌క్లబ్ సభ్యులు దువ్వూరు సుబ్రమణ్యంరెడ్డి, వీవీ అప్పారావు, ఆర్ రాధాకృష్ణరావు, టీ సుదర్శన్‌రావు, కే రఘురామిరెడ్డి, టీ ఆదినారాయణరెడ్డి, సుంకర హరీష్ తదితరులు పాల్గొన్నారు.